# కాంగ్రెస్ వస్తే అంధకారం తప్పదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- **బీఆర్ఎస్‌తోనే దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ**
- **మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

బెజ్జంకి, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పొరపాటున ఓటు వేస్తే మళ్లీ రాష్ట్రం అంధకారం కాకతప్పదని బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, ముత్తన్నపేట, నర్సింహులపల్లి, పోతారం, చీలాపూర్, చీలాపూర్‌పల్లి, పెరుకబండ గ్రామాల్లో శనివారం రోడ్ షో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. ప్రజలు ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో కరువు, కరెంట్ కోత, రైతు ఆత్మహత్యలు పెరిగి తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హత, అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నదన్నారు. అంతేకాకుండా రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసి ఆగంకావద్దని, దూరదృష్టితో దేశం గర్వించే విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఈ నెల 30 తేదీన ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**రసమయి బాలకిషన్‌కు ఘన స్వాగతం**

ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు ఆయా గ్రామాల్లో అపూర్వ స్వాగతం లభించింది. ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడంతో గ్రామాలు జనసంద్రంగా మారాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన.. మరోసారి ఆశీర్వదించండి



భీమదేవరపల్లి: ఎర్రబెల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్

- **స్వరాష్ట్రం వచ్చాక హుస్నాబాద్ ఎలా మారిందో ప్రజలు గమనించాలి**
- **బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్**
- **కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు**
- **మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి**

భీమదేవరపల్లి/వేలేరు, నవంబర్ 11: ఎమ్మెల్యేగా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ప్రజలను కోరారు. శనివారం వేలేరు మండలంలోని ఎర్రబెల్లి, భీమదేవరపల్లి మండలంలోని గొల్లపల్లి, ముస్తఫాపూర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి, రాంనగర్, విశ్వనాథకాలనీ గ్రామాల్లో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన పొన్నం ప్రభాకర్ ఇక్కడకు వలస వచ్చాడని ఎద్దేవా చేశారు. అక్కడ చెల్లని వ్యక్తి ఇక్కడేం చేస్తడో ప్రజలు ఆలోచించాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎప్పుడైనా, ఏ నాయకుడైనా కులం పేరుతో వచ్చాడా? అని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులాల ప్రస్తావన తీసుకురావడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు, వచ్చిన తర్వాత అభివృద్ధిలో నియోజకవర్గం రూపురేఖలు మారాయో లేదో ప్రజలే చెప్పాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు అప్పటి ప్రభుత్వం 1.14 టీఎంసీల సామర్థ్యంతో పదివేల ఎకరాలకు మాత్రమే సాగునీరందించాలని చేపట్టిందన్నారు. కానీ, ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యాన్ని 8.23 టీఎంసీలకు పెంచారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం 3982 మంది భూనిర్వాసితులకు పరిహారం అందించిందని తెలిపారు.

**తెలంగాణను ఢిల్లీ వాళ్ల చేతుల్లో పెడదామా..?: పెద్దిరెడ్డి**

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మళ్లీ ఢిల్లీ వాళ్ల చేతుల్లో పెడదామా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి ప్రశ్నించారు. ఆనాడు రాత్రిళ్లు టార్చి లైటు పట్టుకుని ఎప్పుడు కరెంటు వస్తదో.. ఎప్పుడు పంటకు నీళ్లు పారియల్నో అని బావులకాడ కాపలా కాసిన రోజులను బీఆర్ఎస్ పాలనలో మర్చిపోయామన్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నాయకులు ఎన్నికల ప్రచారానికి వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని, వారి మాయలో పడొద్దని కోరారు. కారుగుర్తుకు ఓటు వేసి సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జడ్పీటీసీ వంగ రవి, వైఎస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా, మాజీ ఎంపీపీ సంగ సంపత్, సర్పంచ్‌లు గూడ కవిత, ఎల్లమ్మ, రొంటాల ప్రభాకర్, ఎర్రబెల్లి చంద్రకళ, అర్కాల రాజు, భూక్యా కవిత, వల్లెపు అనిత, ఎంపీటీసీ సాతూరి రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, నాయకులు నవాబ్‌పాషా, దార్న శ్రీనివాస్, మాక లాజరస్, గూడ రాజ్‌కుమార్, సల్వాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు



నగరంలోని 11వ డివిజన్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులతో మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 11 కరీంనగర్ నియోజకవర్గంలోని నగరంతో పాటు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో శనివారం మంత్రి గంగుల నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. నగరంలోని 11వ డివిజన్‌లోని బీజేపీకి చెందిన మహిళలు స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మదానర్సయ్య ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు కట్టరాంపూర్‌లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంత్రి గంగుల నాలుగోసారి గెలువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల గ్రామనికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ఫకీర్‌పేటకు చెందిన పలువురు శనివారం మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరికల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న కేసీఆర్‌ను తిరిగి మూడోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. పార్టీలతో చేరిన వారిలో నందయ్య, అభినవ్, గంగరాజు, నరేశ్, విజయ్, కిరణ్, అనిల్, శ్రావణ్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొమ్మనపల్లిలో దేశిని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, ఎంపీపీ, నాయకులు

# దేశిని మల్లయ్య సేవలు మరువలేనివి



బొమ్మనపల్లిలో దేశిని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్**
- **ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే వర్ధంతికి హాజరు**

చిగురుమామిడి, నవంబర్ 11: తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని, ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. దేశిని చిన్న మల్లయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్వగ్రామం చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. చిన్న మల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశిని విశేషంగా కృషి చేశారన్నారు. సీఎం కేసీఆర్‌తో కలిసి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. గౌడ కులస్తులు, ఇతర బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇందుర్తి నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. అన్ని పార్టీల నాయకులతో అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం దేశిని మల్లయ్య సతీమణి రాజవ్వ, కుమారులు విప్లవ కుమార్, లక్ష్మణ్, కూతురు అల్లుడు పొన్నం శ్యామల, అమరేందర్‌తో ముచ్చటించారు. వర్ధంతి సభలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పలువురికి స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినీత, సర్పంచ్ కానుగంటి భూమిరెడ్డి, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, ఉప సర్పంచ్ పెండ్యాల శారద, గౌడ సంఘం అధ్యక్షుడు విజ్జగిరి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కత్తుల రమేశ్, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, ఆర్‌బీఎస్ గ్రామాధ్యక్షుడు తాడ శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు రామోజు కృష్ణమాచారి, తోట శ్రీనివాస్, దరిపెల్లి సంపత్, పెండ్యాల సదానందం, వివిధ కుల సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌ను మరో సిద్దిపేటలా మారుస్తా

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి • బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్ రెడ్డి**



ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్11: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే హుజూరాబాద్‌ను మరో సిద్దిపేటలా, మరో సిరిసిల్లలా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి హుజూరాబాద్ ఒకటి, 12, 13, 14 వార్డుల ప్రజలతో కరీంనగర్ రోడ్‌లోని పెట్రోల్ పంపు వద్ద కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను గెలిపిస్తే హుజూరాబాద్ పట్టణంలో మినీ కలెక్టరేట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మోడల్ పోలీస్ స్టేషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే హుజూరాబాద్‌ను ఆదర్శంగా నిలుపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ, కౌశిక్‌ను ప్రజలందరూ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే, ప్రతి అభివృద్ధి పనిని తాను దగ్గరుండి చేయిస్తానని హామీ ఇచ్చారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని మాట్లాడుతూ, కారుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి కుమార్తె శ్రీనికారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, కౌన్సిలర్లు బీ వనితాకుమార్, తొగరు సదానందం, కొండ్ర జీవితానరేశ్, కల్లేపల్లి రామరోషేందర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.